క్లుప్తంగా

గోళీ సైజులో గుడ్డు



ద్వారకాతిరుమల: ఒక నాటు కోడి పెట్ట గోళీ అంత గుడ్డు పెట్టి చూపరులను అబ్బురపరచింది. మండలంలోని దేవినేనివారిగూడెంకు చెందిన షేక్ ఇస్మయిల్‌కు చెందిన కోడి పెట్ట శనివారం ఒక గుడ్డు పెట్టింది. అది గోళీ అంత సైజులో ఉంది. కేవలం 10 గ్రాములు మాత్రమే బరువు ఉండటంతో దాన్ని చూసిన వారు ఆశ్చర్యపోయారు.

ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే తెల్లం బాలరాజు

కుక్కునూరు : మండలంలోని వేలేరు గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో శనివారం ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం శనివారం నిర్వహించారు. వైఎస్సార్‌ సీపీ నాయకుడు సర్వా శ్రీహరి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే తెల్లం బాలరాజు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. తొలుత నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేకి ఘన స్వాగతం పలికారు.

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనపై అవగాహన

ఏలూరు (టూటౌన్‌): ఈనెల 1 నుంచి 30వ తేదీ వరకు బాల కార్మికుల వ్యవస్థ నిర్మూలనపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్టు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఇన్‌చార్జి కార్యదర్శి, ప్రిన్సిపాల్‌ సీనియర్‌ సివిల్‌ జడ్జి కేకేవీ బుల్లి కృష్ణ తెలిపారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఇన్‌చార్జి చైర్మన్‌, మొదటి అదనపు జిల్లా జడ్జి జి.రామగోపాల్‌ ఆధ్వర్యంలో స్థానిక న్యాయ సేవాసదన్‌ భవన్‌లో శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బుల్లికృష్ణ మాట్లాడుతూ ఈ నెల రోజుల పాటు వ్యాపార సంస్థలు, దుకాణాలు, కర్మాగారాల్లో తనిఖీలు చేస్తామన్నారు.

వలంటీర్ల సేవలు అభినందనీయం



కుక్కునూరు : అవార్డులు అందుకున్న వలంటీర్లతో ఎమ్మెల్యే తెల్లం బాలరాజు



వేలేరుపాడు : ఉత్తమ వలంటీర్లను సన్మానిస్తున్న బాలరాజు

- పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు
- కుక్కునూరు, వేలేరుపాడులలో వలంటీర్లకు సత్కారం

కుక్కునూరు : కరోనా కష్టకాలంలో తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా వలంటీర్లు సేవలందించారని, వారి సేవలు అభినందనీయమని పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు పేర్కొన్నారు. శనివారం కుక్కునూరు తహసీల్దార్‌ కార్యాలయం వద్ద వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే బాలరాజు వలంటీర్‌లకు అవార్డులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ .ప్రభుత్వ సంక్షేమ పథకాలు గ్రామాలలోని ప్రతి గుమ్మానికి అందించాలన్న ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్‌ వ్యవస్థను ప్రవేశపెట్టారన్నారు. ప్రజలకు మంచి జరుగుతుండడాన్ని జీర్ణించుకోలేని చంద్రబాబు మగాళ్లు ఇంట్లో లేనప్పుడు వలంటీర్‌లు తలుపులు కొడుతున్నారంటూ పిచ్చి వ్యాఖ్యలు చేశారన్నారు. ప్రజలు కరోనా కష్టకాలంలో ఉన్నప్పుడు ప్రతిపక్ష నాయకులు అందరూ ఇళ్లల్లో దాక్కుంటే వాళ్లు విమర్శించిన వలంటీర్‌లు సేవలందించారని గుర్తుచేశారు. జన్మభూమి కమిటీలంటూ అనర్హులైన తమ సొంత పార్టీ నాయకులకు తప్ప మరెవ్వరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందకుండా చేసిన పచ్చపార్టీ నేతలకు జగనన్న పాలనలో ప్రజలకు జరుగుతున్న సంక్షేమాన్ని చూసి తట్టుకోలేకపోతున్నారని విమర్శించారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధులుగా వలంటీర్‌లు అందిస్తున్న సేవలను గుర్తించేందుకే ముఖ్యమంత్రి వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని చేపట్టారని వివరించారు. మండలానికి చెందిన వలంటీర్‌లు సరియం హరినాథ్‌, గంజి మీనాలకు సేవా వజ్ర, వెంకటరమణ, స్రవంతి, రాణిలకు సేవా రత్న, మరో 174 మంది వలంటీర్‌లకు సేవ మిత్ర అవార్డులను, ప్రశంసా ప్రతాలను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్‌, తహసీల్దార్‌ ప్రమద్వర, జెడ్పీటీసీ కుంజా నాగేశ్వరావు, ఎంపీపీ చేబ్రోలు గీతావాణి, వైస్‌ ఎంపీపీలు తాండ్ర రాజేష్‌, గాడిద రామచంద్రం, ఏఎంసీ డైరెక్టర్‌ గంగుల రమణారెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వైఎస్సార్‌ సీపీ మండల అధ్యక్షుడు కుచ్చర్లపాటి నరసింహరాజు, రావు వినోద్‌, మాదిరాజు వెంకన్నబాబు, పరవా రామిరెడ్డి, రాయి సత్యనారాయణ, ఎల్లంకి లక్ష్మణ్‌రావు, పోలగాని వెంకట్రావు, చేకూరి నవీన్‌, మల్లెల చంటినాయుడు, అయితా కోటేశ్వరావు పాల్గొన్నారు.

వలంటీర్లు.. సమాజ సేవకులు

వేలేరుపాడు : ప్రభుత్వ పథకాలను సకాలంలో లబ్ధిదారులకు అందిస్తున్న వలంటీర్లు సమాజ సేవకులని పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు పేర్కొన్నారు. శనివారం వేలేరుపాడు మండలం కేంద్రంలోని ఎంఈఓ కార్యాలయంలో జరిగిన వలంటీర్ల సత్కార కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందుతున్నాయన్నారు. పేదల ఆనందమే ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని అన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో పింఛన్ల కోసం అవ్వ,తాతలు గంటల కొద్దీ క్యూలో నిలుచోవాల్సి వచ్చేదని అన్నారు. నేడు జగనన్న ప్రభుత్వ హయాంలో తెల్లవారక ముందే లబ్ధిదారుల ఇండ్ల తలుపులు తట్టి వలంటీర్లు పింఛన్లు ఇస్తున్నారన్నారు. గతంలో రాష్ట్రంలో 39 లక్షల మందికే పింఛన్లు వచ్చేవని, నేడు రాష్ట్రంలో 69 లక్షల మందికి అందజేస్తున్న ఘనత వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని అన్నారు. అనంతరం వేలేరుపాడు మండలంలోని ఉత్తమ వలంటీర్లను ఎమ్మెల్యే ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్‌ రమేష్‌, కుక్కునూరు సీఐ సత్యనారాయణ, ఎస్సై శ్రీనివాసరావు, జెడ్పీటీసీ గుజ్జా రామలక్ష్మి, ఎంపీపీ కెచ్చెల లక్ష్మీదేవి, వైస్‌ ఎంపీపీ మేడవరపు నాగశ్రీ, కేసగాని వెంకటేశ్వరమ్మ, ఎంపీటీసీ కొమ్మరాజు రాంబాబు, కోఆప్షన్‌ మెంబర్‌ ఎస్‌కే షౌకత్‌ హుస్సేన్‌, సర్పంచ్‌లు కట్టి ఉదయ్‌కిరణ్‌, లక్ష్మణ్‌, వైఎస్సార్‌ సీపీ మండల కన్వీనర్‌ కేసగాని శ్రీనివాసగౌడ్‌, మండల వ్యవసాయశాఖ చైర్మన్‌ కామినేని వెంకటేశ్వరావు, మండల సచివాలయ కన్వీనర్‌ కొలూరి సత్తిరాజు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న గంగానమ్మ జాతర



మహిళలు సామూహికంగా జొన్నలను దంచుతున్న దృశ్యం

కొయ్యలగూడెం : పొంగుటూరు గ్రామదేవత శ్రీ గంగానమ్మ అమ్మవారి జాతర మహోత్సవంలో భాగంగా శనివారం అమ్మవారి ఆలయం వద్ద మహిళలు సామూహికంగా రోళ్లలో జొన్నలను దంచే కార్యక్రమం నిర్వహించారు. దంచినటువంటి జొన్నలను సాయంత్రం వరి ధాన్యంతో కలిపి వండుతారు. అలా వండిన వంట కుంభాన్ని రాత్రికి అమ్మవారికి నైవేద్యంగా సమర్పిస్తామని జాతర పెద్ద నీలం దుర్గారావు పేర్కొన్నారు. అర్ధరాత్రి నుంచి గ్రామ పొలిమేరల చుట్టూ ముమ్మార్లు బలిచేట ప్రదక్షణలు నిర్వహించారు. జాతర సమయంలో అమ్మవారి వద్ద పాటించే ప్రాచీన నియమ నిబంధనలను తూచా తప్పకుండా అమలు చేస్తున్నామని దుర్గారావు తెలిపారు. ఆదివారం మహా నైవేద్యం, అన్న సమారాధన కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

రైలు ప్రమాద మృతులకు సంతాపం

జంగారెడ్డిగూడెం : ఒడిశాలో జరిగిన రైలు ప్రమాదంలో మరణించిన మృతుల కుటుంబాలకు ఐఎఫ్‌టీయూ జిల్లా కమిటీ తరఫున ప్రగాఢ సంతాపాన్ని, సానుభూతిని తెలియచేస్తున్నామని జిల్లా అధ్యక్షుడు కేవీ రమణ అన్నారు. ఒడిశాలో కోరమాండల్‌, యశ్వంత్‌పూర్‌ ఎక్స్‌ప్రెస్‌, గూడ్స్‌ రైలు మూడు ఢీకొనడంతో వందలాది మంది మరణించారని, ఎంతో మంది క్షతగాత్రులయ్యారన్నారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ మృతుల కుటుంబాలకు రూ.50 లక్షలు, క్షతగాత్రులకు రూ.25 లక్షలు నష్టపరిహారం చెల్లించాలని, ప్రమాద ఘటనపై న్యాయవిచారణ జరిపించాలన్నారు. రైల్వేలను ప్రైవేటుపరం చేయడానికి కార్మికులు, ఉద్యోగుల ఖాళీలను భర్తీ చేయడం లేదన్నారు. రైల్వే కార్మికుల సంఖ్యను పెంచకుండా, ఖాళీలను భర్తీ చేయకుండా ఇటువంటి ప్రమాదాలు నివారించడం సాధ్యం కాదన్నారు. ప్రమాదానికి బాధ్యత వహిస్తూ రైల్వేమంత్రి రాజీనామా చేయాలన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

బుట్టాయగూడెం : లయన్స్‌ ఇంటర్నేషనల్‌ బుట్టాయగూడెం ఏజెన్సీ లయన్స్‌ క్లబ్‌, జంగారెడ్డిగూడెం నిర్మలా మల్టీస్పెషాలిటీ హాస్పటల్‌ వారి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు మండల లయన్స్‌ క్లబ్‌ అధ్యక్ష, కార్యదర్శులు నూపా మధుసూదన్‌బాబు, జాదం శివరామ కృష్ణ శనివారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలపారు. స్థానిక విద్యారోహిణీ డిజిటల్‌ స్కూల్‌ ఆవరణలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వైద్య శిబిరం నిర్వహిస్తారన్నారు. ఈ శిబిరంలో స్త్రీల సంబంధిత వ్యాధులు, చిన్న పిల్లల వైద్య నిపుణులు, సర్జికల్‌ వైద్య నిపుణులు, జనరల్‌ మెడిసిన్‌ వైద్యులు సేవలు అందిస్తారని తెలిపారు. వైద్య పరీక్షలు అనంతరం రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేస్తారని, ఈ అవకాశాన్ని ఏజెన్సీ ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

ఉద్యోగాలకు 6న ఇంటర్వ్యూలు

ఏలూరు (టూటౌన్‌): జిల్లా ఉపాధి కార్యాలయం, సెట్‌వెల్‌, ఏపీఎస్‌ఎస్‌డీసీ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక కలెక్టరేట్‌లోని సెట్‌వెల్‌ కార్యాలయంలో ఈనెల 6న ఉదయం 10.30 నుంచి ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు జిల్లా ఉపాధి అధికారి సి.మధుభూషణరావు ఒక ప్రకటనలో తెలిపారు. వేరియంట్‌ స్కూల్‌లో మహిళా ఉపాధ్యాయుల నియామకానికి బీఈడీ, డీఈడీ, డిగ్రీ, పీజీ విద్యార్హతలు ఉండి 19 నుంచి 40 సంవత్సరాలు వయస్సు ఉన్న వారు అర్హులుగా పేర్కొన్నారు. మ్యాక్స్‌ సెక్యూరిటీలో సెక్యూరిటీ గార్డు ఉద్యోగాలకు 10వ తరగతి పాసయి ఉండి ఎత్తు 5 అడుగుల 6 అంగుళాలు కలిగి ఉండాలని తెలిపారు. డ్రైవర్‌ ఉద్యోగానికి డ్రైవింగ్‌ లైసెన్స్‌ ఉండాలని, అభ్యర్థుల వయస్సు 19 నుంచి 45 సంవత్సరాలు మధ్య ఉండాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు ఫోన్‌ నెంబర్లు 88868 82032.91827 72465, 77999 27615లో సంప్రదించాలని వివరించారు.

సీఆర్‌ఆర్‌ అటానమస్‌ హోదా పొడిగింపు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక సీఆర్‌ రెడ్డి కళాశాలకు అటానమస్‌ హోదాను యూనివర్శిటీ గ్రాంట్స్‌ కమిషన్‌ (యూజీసీ) మరో పదేళ్లు పొడిగించిందని ఆ కళాశాల ప్రిన్సిపాల్‌ కేపీ రామరాజు ఒక ప్రకటనలో తెలిపారు. తమ కళాశాల 1987వ సంవత్సరం నుంచి స్వయం ప్రతిపత్తి హోదా కలిగి ఉందని, ప్రతి ఐదేళ్లకోసారి కళాశాల ప్రమాణాలను సమీక్షించి యూజీసీ అటానమస్‌ హోదాను గ్రాంట్‌ చేస్తుందని వివరించారు. ఈ మేరకు తమ కళాశాల వరుసగా 2005, 2011, 2017, 2022 సంవత్సరాల్లో నాక్‌ ఏ గ్రేడ్‌ పొందడం వల్ల గత నెల 26న జరిగిన సమావేశంలో తమ కళాశాలకు 2022–23 విద్యా సంవత్సరం నుంచి 2031–32 విద్యా సంవత్సరం వరకు స్వయం ప్రతిపత్తి హోదాను గ్రాంట్‌ చేసినట్టు వివరించారు. ఈ ఘనత సాధించడానికి నిరంతరం కృషి చేసిన అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బందికి సీఆర్‌ఆర్‌ విద్యాసంస్థల పాలక మండలి అధ్యక్ష, కార్యదర్శులు అల్లూరి ఇంద్రకుమార్‌, ఎంబీఎస్‌వీ ప్రసాద్‌, కరస్పాండెంట్స్‌ కేఎస్‌ విష్ణుమోహన్‌, కానాల శ్రీనివాసరావు ప్రత్యేకంగా అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

సాగు పట్టాలు మంజూరు చేయాలి

ఏలూరు (టూటౌన్‌): గుట్ట పోరంబోకు, పోరంబోకు, గయ్యాలి, పోడు, అటవీ భూములు సాగు చేసుకుని జీవించే దళిత వెనుకబడిన వర్గాల రైతులకు సాగు పట్టాలు మంజూరు చేసి రైతు భరోసా వర్తింపజేయాలని దళిత సేన రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు జిజ్జువరపు రవిప్రకాష్‌ కోరారు. స్థానిక సంఘం రాష్ట్ర కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పేదలకు రైతు భరోసా వర్తింపజేయడం ద్వారా ఆర్థికంగా ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో దళిత సేన ఏలూరు జిల్లా కార్యదర్శి పిరంగుల ఇదియా, నాయకులు విస్సన్నపల్లి సురేష్‌, బుల్లా రవికుమార్‌, పింగుల విజయమ్మ, యలమర్తి నాగయ్య, లక్కపాము దాను, లక్ష్మీకాంతం, సరోజని పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలి



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న జూనియర్‌ సివిల్‌ జడ్జి కిషోర్‌

జంగారెడ్డిగూడెం : ఈ నెల 5వ తేదీన ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జంగారెడ్డిగూడెం మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జూనియర్‌ సివిల్‌ జడ్జి సీహెచ్‌ కిషోర్‌ కుమార్‌ మాట్లాడుతూ ప్రతి పౌరుడు పర్యావరణంపై అవగాహన కలిగి ఉండాలని, భవిష్యత్తు తరాలకు మంచి పర్యావరణం అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ సందర్భంగా న్యాయస్థానాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో బార్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు అచ్యుత శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు తల్లాడి అశోక్‌కుమార్‌, న్యాయవాదులు మేకల రామ్మోహనరావు, జీవీవీఆర్‌ శేఖర్‌, పల్లి పెద్దిరాజు, బి.సాయికుమారి, తొర్లపాటి శ్రీనివాస్‌, ఓగిరాల సువర్ణ రత్నకుమార్‌, జి.మణికుమార్‌, ఎం.కృష్ణమోహన్‌, ఎ.వెంకటేష్‌ పాల్గొన్నారు.

కాలువ పూడికతీత పనులు ప్రారంభం



కాలువ పూడికతీత పనులను ప్రారంభిస్తున్న ఎంపీపీ వెంకటరెడ్డి

పోలవరం రూరల్‌ : పోలవరం మండలం కొత్త పట్టిసీమ గ్రామ పంచాయతీ పరిధిలోని మురుగు నీరు, కాలువ నీరు ప్రవహించే కాలువను మరమ్మతులు చేసే పనులను చేపట్టారు. కాలువ గట్టు పూడిక తీసే పనులను రూ. 5 లక్షల మండల పరిషత్‌ నిధుల నుంచి మంజూరు చేసి శనివారం పనులు ప్రారంభించారు. ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి సర్పంచ్‌ మైగాపుల విజయదుర్గ, ఎంపీటీసీ వలవల వరలక్ష్మి కాలువ శుభ్రం చేసే పనులకు కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు అడ్డగర్ల సాయిబాబ, మైగాపుల దుర్గాప్రసాద్‌, ఉప సర్పంచ్‌ రంభ శ్రీనివాస్‌, రొంగల సుబ్బారావు, వలవల బాలాజీ, పూడి వెంకట్రావు, పంచాయతీ కార్యదర్శి విజయకుమారి, తదితరులు పాల్గొన్నారు.

రెజ్లర్లకు మద్దతుగా మహిళా కార్మికుల ధర్నా



నిరసన వ్యక్తం చేస్తున్న వంగూరు గౌతమీ ఫ్యాక్టరీ మహిళా కార్మికులు

ఏలూరు (టూటౌన్‌): మహిళా మల్ల యోధులను లైంగికంగా వేధించిన దోషులను కాపాడుతోన్న మోదీ, షాల ప్రభుత్వ విధానాలను ఖండిస్తూ ఇఫ్టూ ఆధ్వర్యంలో ఏలూరు సమీపంలోని వంగూరు గౌతమీ ఫ్యాక్టరీ మహిళా కార్మికులు శనివారం ధర్నా చేశారు. తమపై లైంగిక వేధింపులకు పాల్పడిన బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్‌ను అరెస్టు చేయాలని కోరుతూ గత ఏప్రిల్‌ 23 నుంచి ఢిల్లీలోని జంతర్‌ మంతర్‌ వద్ద ఆందోళన చేస్తోన్న మహిళా మల్ల యోధులపై నిర్బంధాన్ని ప్రయోగిస్తూ అరెస్టులు చేయడాన్ని ఖండించారు. ఇఫ్టూ జాతీయ కమిటీ పిలుపు మేరకు ఈ నిరసన చేపట్టామన్నారు. ఈ సందర్భంగా ఇఫ్టూ రాష్ట్ర సహాయ కార్యదర్శి యు.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మహిళా మల్ల యోధులు న్యాయం కోసం పోరాడుతుంటే మోదీ, షాల ప్రభుత్వం నేరస్తులను కాపాడుతోందని విమర్శించారు. బేటీ బచావో – బేటీ పడావో అంటే ఇదేనా అని ప్రశ్నించారు. దేశానికి కీర్తి ప్రతిష్టలు తీసుకొచ్చి బంగారు పతకాలు సాధించిన మహిళా మల్ల యోధులను లైంగికంగా వేధించిన వారిని అరెస్టు చేయకుండా దేశ పరువును ప్రపంచంలో మంట గలిపారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాస్వామిక పద్ధతుల్లో నిరసన చేపట్టిన వారిపై లాఠీచార్జి చేసి, అరెస్టు చేయడాన్ని ఖండించారు. ఇప్పటికైనా సుప్రీం కోర్టు జోక్యం చేసుకుని బీజేపీ ఎంపీ బ్రిజ్‌ భూషణ్‌ వెంటనే అరెస్టు చేయాలని కోరారు. కార్యక్రమంలో వంగూరు గౌతమి ఆగ్రో ఇండస్ట్రీస్‌ లిమిటెడ్‌ వర్కర్స్‌ యూనియన్‌ అధ్యక్షులు వి.పద్మ, నాయకులు ఆలిసమ్మ, రాణి, బి.పద్మ, లిల్లీ పుష్ప, రంగమ్మ, మోతి భవాని, రమణమ్మ, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

నిర్వాసితులకు పునరావాస చర్యలు చేపట్టాలి

ఏలూరు (టూటౌన్‌): పోలవరం నిర్వాసితులకు పూర్తిస్థాయి పునరావాస చర్యలు చేపట్టాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మంతెన సీతారాం, వి.వెంకటేశ్వర్లు కోరారు. స్థానిక పవరుపేటలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు తెల్లం రామకృష్ణ అధ్యక్షతన శనివారం నిర్వహించిన ఏలూరు జిల్లా కమిటీ సమావేశంలో వారు మాట్లాడారు. గతేడాది జూలైలో గోదావరికి వచ్చిన వరదల నుంచి ప్రజలు ఇంత వరకు కోలుకోలేదన్నారు. రానున్న వర్షాకాలంలో మరోసారి గోదావరి వరదలు ముంచెత్తే ప్రమాదం పొంచి ఉన్నందున ముందస్తు చర్యలు తీసుకోవాలని వారు కోరారు. పోలవరం ప్రాంతంలోని 8 మండలాల ప్రజలు అభివృద్ధికి, సంక్షేమానికి నోచుకోక అడవుల్లో చెట్టు, పుట్టలపాలై బతుకుతున్నారని వాపోయారు. కేంద్రం ఏజెన్సీ గిరిజనులకు ఎలాంటి సహాయం అందించకుండా నిర్లక్ష్యం చేసిందని, పునరావాసానికి నిధులు ఇవ్వడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రీ సర్వే పేరుతో మరో 32 గ్రామాలను కొత్తగా చేర్చిందన్నారు. శాస్త్రీయ ప్రాతిపదికపై రీసర్వే చేసి దాని ఆధారంగా అన్ని గ్రామాలకు పూర్తి స్థాయి పునరావాస చర్యలు చేపట్టాలని కోరారు. సీపీఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ ఎండల తీవ్రత నేపథ్యంలో ఉపాధి పని ప్రదేశాల్లో కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించాలన్నారు. జిల్లాలో చెరువులు, గుంతలు అక్రమంగా తవ్వి మట్టి, ఇసుక రవాణా చేస్తున్నారని దీనిని అరికట్టి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డీఎన్‌వీడీ ప్రసాద్‌, పి.కిషోర్‌, ఎం.నాగమణి, జిల్లా కమిటీ సభ్యులు బి.సోమయ్య, కె.శ్రీనివాస్‌, పి.రామకృష్ణ, తామా ముత్యాలమ్మ, గుడెల్లి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

నేడు ధ్యాన ఆత్మజ్ఞాన శిక్షణ

జంగారెడ్డిగూడెం : స్థానిక శేషాద్రినగర్‌లోని పిరమిడ్‌ స్పిరిట్యువల్‌ ట్రస్ట్‌ ఆధ్వర్యంలో పిరమిడ్‌ ధ్యాన ఆత్మజ్ఞాన శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పిరమిడ్‌ ట్రస్ట్‌ అధ్యక్షుడు కాకి రామకృష్ణ, కార్యదర్శి తటవర్తి కృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఆదివారం ఉదయం 9.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు శ్రీ గౌరిసుభద్ర పిరమిడ్‌ ధ్యాన మందిర అనుబంధ మైత్రేయ మందిరంలో సీనియర్‌ పిరమిడ్‌ మాస్టర్‌ ఏసీ పుల్లయ్య పాల్గొని శిక్షణ ఇస్తారన్నారు. కార్యక్రమంలో ధ్యానులు, ఆధ్యాత్మిక సాధనాపరులు, ఆత్మజ్ఞాన జిజ్ఞాసులు అందరూ పాల్గొంటారన్నారు.

పారిజాతగిరిలో పూజలు



ప్రత్యేకాలంకరణలో స్వామివారు

జంగారెడ్డిగూడెం : పట్టణంలోని గోకుల తిరుమల పారిజాతగిరి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకులు నల్లూరి రవికుమారాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారిని విశేషంగా అలంకరించి సుప్రభాతసేవ, ఆరాధన, తోమాలసేవ, తీర్థప్రసాదగోష్టి, అష్టోత్తర పూజలు అర్చకస్వాములు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు 108 ప్రదక్షిణలు చేసి మొక్కుబడులు చెల్లించుకున్నారు. భక్తులకు ఉచిత మజ్జిగ, ప్రసాదం అందించారు. బుట్టాయగూడెం గ్రామానికి చెందిన అన్నపురెడ్డి రంగస్వామి రెడ్డి, కుటుంబసభ్యులు అన్నప్రసాద వితరణ చేశారు. దాతలను ఆలయ మర్యాదలతో స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదాలు అందచేసి వేదపండితులు ఆశీర్వచనాలు అందించారు. కార్యక్రమంలో అభివృద్ధి కమిటీ సభ్యులు కంది బాలకృష్ణారెడ్డి, రెడ్డి రంగప్రసాద్‌, వాసవి సాయి నగేష్‌, దండు ధనరాజు, ఆలయ ఈఓ మానికల రాంబాబు పాల్గొన్నారు.

చింతాలమ్మ దశమ వార్షికోత్సవం



అచ్యుతాపురంలో కొలువైన శ్రీ చింతాలమ్మ అమ్మవారు

కొయ్యలగూడెం : అచ్యుతాపురం శివారు త్రినాధపురం రోడ్‌లో కొలువైన శ్రీ చింతాలమ్మ అమ్మవారి దశమ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. శనివారం తెల్లవారు జాము నుంచి ఉత్సవాలను ప్రారంభించగా పరిసర గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున ఆలయం వద్ద సంప్రదాయ పూజలు నిర్వహించారు. ముఖ్యంగా రైతులకు చెందిన కుటుంబాల వారు అమ్మవారికి నైవేద్యాలు పెట్టి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా తొమ్మిది అడుగుల ఎత్తున్న అమ్మవారి విగ్రహాన్ని విశేష అలంకరణతో తీర్చిదిద్దారు. మధ్యాహ్నం రెండు వేల మందికి పైగా భక్తులకు అన్న సమారాధన నిర్వహించి సాయంత్రం నుంచి అమ్మవారి పారాయణాది కార్యక్రమాలు చేశారు.

హిందీ భాషపై పట్టు సాధించాలి



పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు

ద్వారకాతిరుమల : జాతీయ భాష హిందీపై పట్టు సాధించిన విద్యార్థులు దేశంలో ఎక్కడైనా ఉద్యోగావకాశాలు పొందుతారని గ్రంథాలయ అధికారిణి గుర్రం బంగారు పాప అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా శనివారం విద్యార్థులతో హిందీ భాష అక్షరమాల రాయించి, చదివించారు. గ్రంథాలయ సహాయకురాలు బట్టు మణి, పాఠకులు పాల్గొన్నారు.

మలేరియాపై అప్రమత్తంగా ఉండండి

ఏలూరు రూరల్‌: మలేరియా జ్వరం పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏలూరు అసిస్టెంట్‌ మలేరియా అధికారి జె.గోవిందరావు అన్నారు. మలేరియా నివారణ మాసోత్సవంలో భాగంగా శనివారం ఏలూరు మండలం ప్రత్తికోళ్లలంకలో వైద్య సిబ్బంది అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గోవిందరావు మాట్లాడుతూ పరిసరాల్లో మంచినీటి నిల్వ ఉండే ప్రాంతాల్లో మలేరియా కారక దోమ పెరుగుతుందన్నారు. ప్రజలు అప్రమత్తమై మంచినీటి నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.